క్లుప్తంగా

పేద విద్యార్థులపై కూటమి నిర్లక్ష్యం


సబ్బెళ్ల కృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులు దారుణమైన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. ఆయన సోమవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు ఆహారం, వసతుల సౌకర్యం కల్పనపై కూటమి నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏడాదికి రూ.1400 కోట్లు చొప్పున ఐదేళ్ల పాటు రూ.7,245 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ప్రస్తుతం కూటమిపాలనలో ప్రతీ రోజు మీడియాలలో సామాజిక మాధ్యమాలలో వసతిగృహాల విద్యార్థులు పడుతున్న పాట్లు చూస్తున్నామన్నారు. బడుగు బలహీన వర్గాల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ విద్యార్థులపై నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

సీఎస్‌సీ బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం


సీఎస్‌సీ బ్యాంకు బీఎంతో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువులో సీఎస్‌సీ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ, అభివృద్ధి పథంలో పయనించాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. బీఎం కె.అరుణ్‌కుమార్, క్లస్టర్ మేనేజర్ షేక్ రాజా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు అభినందనలు

కోరుకొండ: ఎస్సీ సంక్షేమ అభివృద్ధి జాయింట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు మాదిగ ఐక్య వేదిక గౌరవాధ్యక్షుడు ఇండిగమెల్లి సత్యనారాయణ, కన్వీనర్ మద్దాల చంటిబాబు అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసినందుకు పార్టీ అధిష్టానం ఆయనకు ఆ బాధ్యత అప్పగించింది.

డ్రాయింగ్ టీచర్ జాకబ్‌రాజుకు సత్కారం


డ్రాయింగ్ టీచర్ జాకబ్ రాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోరుకొండ: గుమ్ములూరు హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ కె. చంద్ర జాకబ్‌రాజును సోమవారం ఈ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఇటీవల కాకినాడలో యంగ్ మైండ్స్ రేపటి కోసం అనే సంస్థ నిర్వహించిన వార్షికోత్సవంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు చేతుల మీదుగా జాకబ్ రాజు అవార్డు పొందారు. ఈ నేపథ్యంలో సోమవారం గుమ్ములూరు హైస్కూల్లో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగాభవాని, గుమ్ములూరు మాజీ సర్పంచ్ చిటికెన భాస్కరరావు, స్థానిక నాయకులు కంచుమర్తి దుర్గారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం శ్లాబ్ పనుల పరిశీలన

పెదపూడి: వాటర్ ట్యాంక్ మరమ్మతులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. కుమారప్రియం పంచాయతీలోని సురక్షిత తాగునీటి సరఫరా పథకం (వాటర్ ట్యాంక్) శ్లాబ్‌మరమ్మతులను సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ.శివాజీ, సర్పంచ్ బీరద వీర వెంకట సత్యనారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ట్యాంక్ శ్లాబ్ శిథిలమై, ప్రమాదకరంగా మారడంతో మరమ్మతులకు ఎంపీడీఓ నరేంద్రరెడ్డి రూ.3 లక్షలు మంజూరు చేశారన్నారు.

భూ రీసర్వే గ్రామసభ

సీతానగరం: రైతుల భూములకు కచ్చితమైన హద్దుల గుర్తింపు కోసమే భూ రీసర్వే నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. సోమవారం చినకొండేపూడి పంచాయతీ వద్ద తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ యజమానులు చనిపోతే వారి వారసుల తమ పేరుపై మార్చుకోవటానికి సులభంగా జరుగుతుందన్నారు.

సాగులో యంత్ర సాయం

- వ్యవసాయంలో పెరుగుతున్న యంత్రాల వినియోగం
- ఖర్చు తక్కువ, సమయం ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు


ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు


వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీపై అందించిన ట్రాక్టర్లు (ఫైల్)

రంగంపేట: ఆధునిక కాలంలో వ్యవసాయంలో అనేక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగింది. వీటి వల్ల తక్కువ సమయంలో పనులు జరగడంతో పాటు ఖర్చు ఆదా అవుతోంది. ముఖ్యంగా కూలీల కొరతను అధిగమించడానికి అవకాశం కలుగుతోంది. దీంతో చాలామంది రైతులు వ్యవసాయంలో యంత్రీకరణ వైపు అడుగులు వేస్తున్నారు. గతంలో పొలం దున్నాలన్నా, విత్తనం నాటాలన్నా, పండించిన పంటను ఇంటికి తీసుకురావాలన్నా కాడెద్దులు, ఎడ్లబండ్లను ఉపయోగించేవారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ట్రాక్టర్లు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. యంత్రాల రాకతో ఇప్పుడు కాడెద్దుల వినియోగం తగ్గింది. గ్రామాల్లో అక్కడక్కడా తప్ప ఎక్కువగా కనిపించడం లేదు.

యంత్రాల వైపే రైతుల మొగ్గు

వ్యవసాయం చేసే ప్రతి రైతు ఇంటి వద్ద గతంలో ఎడ్లబండి, పశువులు, పశువుల పాక ఉండేవి. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో వాటికి ప్రాధాన్యం తగ్గింది. సాంకేతికత పెరిగిపోవడంతో రైతులు తక్కువ సమయంలోనే పనులు ముగించుకునేలా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతు ఇంటి ముందు ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. ఒకటి, రెండు ఎడ్ల బండ్లు ఉన్నా వారిని బాడుగకు పిలిచేవారు లేరు. తక్కువ సమయంలో ఎక్కువ వ్యవసాయ పనులు చేసేలా ఆధునిక యంత్రాలు రావడంతో అందరూ వాటిపైనే మొగ్గు చూపుతున్నారు.

సబ్సిడీపై యంత్రాలు

ఒకప్పుడు ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండానే వ్యవసాయం చేసుకునేవారు. ఇప్పుడు అనేక వ్యవసాయ పథకాలు అమలు చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులకు కూడా సాంకేతిక ఆధునిక యంత్రాలు సబ్సిడీపై అందజేస్తున్నారు. ట్రాక్టర్‌తో పాటు వివిధ రకాల విత్తనాలు, కోత మెషీన్లు, రోటోవేటర్లు తదితర వాటిని ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వాయిదాల రూపంలో యంత్రాలు అందుబాటులోకి రావడంతో రైతులు ఎద్దులతో వ్యవసాయానికి ఆసక్తి చూపడం లేదు.

వైఎస్సార్ సీపీ పాలనలో..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని గత వైఎస్సార్ సీపీ పాలనలో అన్నదాతలు అన్ని విధాలుగా ముందడుగు వేశారు. వారికి విత్తు నుంచి విక్రయం వరకూ ప్రభుత్వం తోడుగా నిలిచింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలకు అడుగడుగునా సాయం అందించింది. విత్తనం నుంచి ఎరువుల వరకూ సరఫరా చేయడంతో పాటు సాగులో అనేక సలహాలు ఇచ్చింది. అలాగే రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేసింది.

గతంలో కాడెద్దులకు డిమాండ్

గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు రైతులు ఎద్దుల బండ్లు సిద్ధం చేసుకునేవారు. వాటికి మంచి డిమాండ్ ఉండేది. సాగుకు అవసరమైన వ్యవసాయ పనులు చేయించుకునేందుకు ముందుగానే ఎడ్లు బండ్లు ఉన్న వారికి డబ్బును అడ్వాన్సుగా ఇచ్చేవారు. కూలీలకు కూడా డిమాండ్ బాగా ఉండేది. ఇప్పుడు కూలీలను కలుపు తీయడానికి, మందులు జల్లడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. యంత్రాలతో పనులు చేయించడం వల్ల ఖర్చు తక్కువతో పాటు సమయం ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు.

అనపర్తి, రాజానగరం నియోజక వర్గాల్లో...

అనపర్తి, రాజానగరం నియోజక వర్గాల్లో 93,650 ఎకరాల్లో వరి, సుమారు 53,700 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతుండగా సుమారుగా 70 వేల మంది రైతులు ఉన్నారు. అనపర్తి నియోజక వర్గంలో 46,500 ఎకరాల్లో వరి, 16,400 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతుండగా, రాజానగరం నియోజకవర్గంలో 47,650 ఎకరాల్లో వరి, 37,300 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయి.

రెండు జతల కాడెద్దులు ఉండేవి



నాకు 12 ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉంది. 16 ఏళ్ల క్రితం రెండు జతల కాడెద్దులు ఉండేవి. ఈ ఎద్దులు, కూలీలతో వ్యవసాయం చేసే వాళ్లం. కూలీలు కూడా దొరకడం కష్టంగా ఉండటంతో పాటు పశుపోషణ సమస్యగా ఉన్న సమయంలో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి పొలంలో ట్రాక్టర్‌తోనే వ్యవసాయం చేస్తున్నాం. ఈ విధంగా ట్రాక్టర్ ద్వారా వ్యవసాయ పనులు చేయడం వల్ల సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తగ్గుతోంది.

– నలమాటి భీముడు, వడిశలేరు, రంగంపేట మండలం

ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు



మాకు పదెకరాల పొలం ఉంది. గతంలో కాడెద్దులు ఉన్న వారికి బాడుగ చెల్లించి పొలంలో వ్యవసాయ పనులు చేయించేవాడిని. ట్రాక్టర్లు వచ్చినప్పటి నుంచి కాడెద్దుల వినియోగం తగ్గింది. ట్రాక్టర్లతోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. గతంలో కాడెద్దులతో పని చేయించాలంటే రోజంతా కష్టపడేవాళ్లం. ట్రాక్టర్‌తో అయితే గంటలోనే పని అయిపోతుంది. భూమి దున్నేప్పటి నుంచి వ్యవసాయ పనులన్నీ ట్రాక్టర్‌తోనే చేయిస్తున్నాం.

– కంటిపూడి సత్యనారాయణ, చంద్రేడు, రంగంపేట మండలం

'నన్నయ'లో క్రికెట్ పోటీలు ప్రారంభం


బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: విద్యార్థులందరూ క్రీడా స్ఫూర్తితో ఉండాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో సోమవారం మెన్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి బౌలింగ్ చేయగా, వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ బ్యాటింగ్ చేసి, పోటీలను ప్రారంభించారు. క్రికెట్‌తో పాటు కోకో, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు కూడా జరుగుతాయన్నారు. పోటీల నిర్వాహకులు వి.సాల్మన్ దేవానంద్, డాక్టర్ వీవీఎంయూ ఫణీంద్ర, పీడీలు డాక్టర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, డాక్టర్ కె.బాల సత్యనారాయణ, సీహెచ్. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెరిగిన అడ్మిషన్లు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగినట్టు ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ తీసుకున్న చర్యల కారణంగా కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య 134 నుంచి 150కు పైగా పెరగడం జరిగిందన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం, కళాశాల సిబ్బంది నిరంతరం కృషి వల్ల 2024–25 సంవత్సరంలో 88 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. కళాశాల సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచడం జరిగిందన్నారు. వీటి వల్ల జిల్లా స్థాయిలో రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల గుర్తింపు సాధించిందన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీ డీవీ కృష్ణ

బిక్కవోలు: ప్రకృతి వ్యవసాయం లాభదాయమని, రైతులతో ఆ విధానంలో సాగు చేయించాలని అనపర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు డీవీ కృష్ణ అన్నారు. బలభద్రపురం గ్రామంలోని రైతుసేవ కేంద్రంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మొదటి ప్రకృతి వ్యవసాయ మోడళ్లు, 9 సహజ సూత్రాలు, ఏటీఎం పెరటి తోటలు, ఏ గ్రేడ్ మోడళ్లు, పలు పంటల సాగుపై మెళకువలు తెలిపారు. ఏడీ డీవీ కృష్ణ మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈసారి రైతులు సంఖ్య, విస్తీర్ణం పెంచాలన్నారు. దీనివల్ల రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలోని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ బొర్రా తాతారావు, అడిషనల్ డీపీఎం వల్లీ, వ్యవసాయ శాఖ ఏవో శామ్యూల్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు ధార్మిక జట్లు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ నారాయణరావు

పెదపూడి: గ్రామాల్లో ధర్మ రక్షణ కోసం ధార్మిక జట్లు ఏర్పాటు చేస్తున్నామని విజయవాడలోని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కంబాల నారాయణరావు తెలిపారు. జి.మామిడాడలోని సూర్యనారాయణస్వామి దేవాలయ మంటపంలో సోమవారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా భారత మాత చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ భక్తితో పాటు దేశ భక్తి పెంచుకోవాలని కోరారు. గ్రామ ధార్మిక జట్ల ఏర్పాటుతో ధర్మాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, జిల్లా మహిళా కన్వీనర్ గంధం వెంకటలక్ష్మి, సహకన్వీనర్ వాసంశెట్టి సూర్యావతి, జిల్లా పరియోజన ప్రముఖ్ కొప్పన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఆయకట్టు భూములకు సాగునీరు


బొర్రంపాలెం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేస్తున్న రైతులు

రంగంపేట: పుష్కర ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందిస్తామని పుష్కర ఎత్తిపోతల పథకం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేశ్వరరావు అన్నారు. ఆయన సోమవారం బొర్రంపాలెం పుష్కర మినీ ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ గత వారం ఎర్రంపాలెం ఎత్తి పోతల నుంచి నీటి తోడకం ప్రారంభమైందని, ఇప్పుడు బొర్రంపాలెం కూడా ప్రారంభం కావడంతో సాగునీటి ఎద్దడి ఉండదన్నారు. వాస్తవానికి ఎర్రంపాలెం, బొర్రంపాలెం ఎత్తిపోతల పథకాలతో గండేపల్లి మండలానికి ఎక్కువ ప్రయోజనం కలిగినా, రంగంపేట మండలంలో మర్రిపూడి, కోటపాడు, వెంకటాపురం, పెదరాయవరం, చంద్రేడు, వడిశలేరు గ్రామాలకు ఉపయోగం ఉందన్నారు. వారం రోజుల్లో రెండవ మోటార్‌ను కూడా ప్రారంభిస్తామన్నారు. చాగల్నాడు పథకం నీరు శివారు గ్రామాలైన దొడ్డిగుంట, సింగంపల్లి, మర్రిపూడికి అందడం లేదని, ఈ కారణంగా బొర్రంపాలెం ఎత్తిపోతల పథకం మిగులు జలాలను చాగల్నాడు కాలువకు మళ్లించాలని మర్రిపూడి గ్రామానికి చెందిన పుట్టా సోమన్న చౌదరి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పుష్కర ఎత్తిపోతల పథకం ఈఈ రాజేశ్వరరావు, డీఈ నాగేంద్ర ప్రసాద్‌లను రంగంపేట మండలం పుష్కర సాగునీటి ఆయకట్టు దారుల తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పుష్కర పథకం ఏఈ ప్రమీల, విద్యుత్ ఏఈ శాంతి, రైతులు పాల్గొన్నారు.

అక్రమాలతో వ్యక్తిగత సంపద సృష్టి

- ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తీరు దారుణం
- నియోజకవర్గంలో జోరుగా పేకాట క్లబ్‌లు
- ఇటీవల జరిగిన టాస్క్‌ఫోర్స్ దాడే దానికి నిదర్శనం
- విలేకరులతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కూటమి ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో 'వ్యసనాల ద్వారా సంపద సృష్టి' అనే శాఖను ఏర్పాటు చేసి, దానికి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని మంత్రిగా నియమించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేకాట, గంజాయి, బెల్ట్ షాపులు, అక్రమ మట్టి విక్రయాల ద్వారా వ్యక్తిగత సంపదను పెంచుకుంటున్నారని, ఆ అక్రమాల బురదను మాత్రం జాతీయ పార్టీకి అంటిస్తున్నారని ఆరోపించారు. గత శనివారం రాత్రి ఎమ్మెల్యే స్వగ్రామం రామవరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేయడం, భారీ స్థాయిలో వాహనాలు, నగదును స్వాధీనం చేసుకుని 27 మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

పేకాట క్లబ్‌లు

మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామవరంతో పాటు నియోజకవర్గంలో పలు గ్రామాలలో బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, అతడి కుమారుడి అనుచరులు పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై తాను అనేక సార్లు మాట్లాడానని, అయితే ఎక్కడా పేకాట క్లబ్‌లు లేవు అన్న రామకృష్ణారెడ్డి ఇప్పుడు ఏమీ సమాధానం చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా జూదరులు వచ్చి, ఇక్కడ పేకాడుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. మందు, విందు, తదితర సౌకర్యాలతో భారీగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన సంపద అభివృద్ధి కోసం వ్యసనాలను ప్రోత్సహించి, యువతను చెడు మార్గం పట్టించి, నియోజకవర్గంలో బెల్ట్ షాపులు, పేకాట శిబిరాలను అభివృద్ధి చేస్తున్నారని విమర్శించారు. వాటి ద్వారా వచ్చిన మామూళ్లు ఎమ్మెల్యే పట్టపురాణికి సంపద లక్ష్మి పథకంగా మారాయన్నారు.

ఆ విషయం తెల్పాలి

రామవరంలో పేకాట క్లబ్ నిర్వహించిన షెడ్డు.. ప్రభుత్వ నిధులతో నిర్మించిన గోకులమా, లేక బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి వరసకు సోదరుడు, ముఖ్య అనుచరుడు నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి స్థావరమా అనేది అధికారులు తేల్చాలని సత్తి సూర్యానారాయణరెడ్డి డిమాండ్ చేశారు. పేకాట శిబిరం నిర్వహించిన షెడ్డు నిర్మించిన పొలం నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డికి చెందినదని, దానిలో నిర్మాణం చేయడానికి రామవరం పంచాయతీ నుంచి గోపాలకృష్ణారెడ్డి ప్లాన్ అప్రూవల్ పొందాడన్నారు. అయితే గోకులం నిర్మాణంలో భాగంగా వేరే వ్యక్తి పేరుపై ప్రభుత్వ నిధులు పొందడానికి ఈ షెడ్డు నిర్మాణం మొదలు పెట్టారని, ఎమ్మెల్యే అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట అన్నారు.

మూలారెడ్డి ప్రతిష్టను దిగజార్చుతున్నారు

స్వర్గీయ మూలారెడ్డి రాజకీయ వారసుడిని, 50 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చెప్పుకుంటున్నారని, అయితే తన అవినీతి, అక్రమాలతో మూలారెడ్డి ప్రతిష్టను కూడా దిగజారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అన్నారు. పేకాట, గంజాయి, బెల్ట్ షాపులు, లేఅవుట్ల మామూళ్లు, సెటిల్మెంట్ దందాలు, ప్రతిపక్ష కార్యకర్తలపై భౌతిక దాడులు వంటివి మూలారెడ్డి పాలనలో లేవన్నారు. ముందుగా మూలారెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, క్షమాపణ కోరి, ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి సూచించారు.

కోర్టు ఆదేశాలపై కేసు నమోదు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన సుంకవల్లి కల్యాణ్ శేఖర్ కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2024 జూన్ 23న కల్యాణ్ శేఖర్ ఇంటిలోకి పరిమి బుచ్చియ్యమ్మ, పరిమి ఆనందబాబు, చేవ సత్యనారాయణ, చేవ శ్రీను అక్రమంగా ప్రవేశించారు. ఆయనపై దాడి చేసి, వస్తువులను నాశనం చేసి, కొంత బంగారం దొంగిలించి భయపెట్టారు. దీనిపై కల్యాణ్ శేఖర్ కోర్టును ఆశ్రయించారు.

సమస్యలపై ఏడు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు అందాయి. పట్టాదారు పాస్‌బుక్‌లో తప్పులు, స్థలం ఆక్రమణ తదితర వాటిపై ప్రజలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్ట్ సతీష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తాళం తీశారు

- ముగ్గళ్ల హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు ప్రారంభం
- 'సాక్షి' కథనంతో సమస్య పరిష్కారం

సాక్షి ఇంపాక్ట్


ముగ్గళ్ల హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీతానగరం: ముగ్గళ్ల గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ సెంటర్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో సోమవారం వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. లక్షల రూపాయలతో నిర్మించిన ఈ హెల్త్ సెంటర్‌ను వినియోగించకుండా తాళం వేసి ఉంచిన విషయం తెలిసిందే. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 27న (ఆదివారం) 'సాక్షి' పత్రికలో 'తాళం తీసేదెప్పుడో' అనే కథనం ప్రచురితమైంది. వైఎస్సార్ హెల్త్ సెంటర్ (విలేజ్ హెల్త్ క్లినిక్) నిరుపయోగంగా మారిందని, సదుపాయాలు ఉన్నా వైద్య ఆరోగ్య సిబ్బంది చిన్న చిన్న లోపాలు చూపి సెంటర్‌కు తాళాలు వేశారని, అందులో వైద్యసేవలు అందించడానికి ససేమిరా అంటున్నారని కథనంతో వివరించారు. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పందించారు. హెల్త్ సెంటర్‌కు కావాల్సిన సౌకర్యాలు యుద్ధ ప్రాతిపదికన సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెల్త్ సెంటర్‌కు కావాల్సిన విద్యుత్, నీటి సరఫర కనెక్షన్లు పంచాయతీ సర్పంచ్ గెద్దం భద్రలక్ష్మి ఇప్పించారు. బొబ్బిల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఈ.ఏసురాణి పర్యవేక్షణలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సోమవారం ఓపీ సేవలు ప్రారంభించారు. దీనిలో భాగంగా 31 మందికి ఎంఎల్‌హెచ్‌పీ కె.పావని వైద్యసేవలు అందించారు. రోగులకు కావాల్సిన మందులు పంపిణీ చేశారు. ప్రతి రోజు హెల్త్ సెంటర్‌లోనే స్థానిక ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తామని, అందరూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని డాక్టర్ ఏసురాణి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీహెచ్ వంశీకృష్ణ, ఎంపీహెచ్ ఈవో వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్ బాబు, ఏఎన్ఎం కె.కృష్ణవేణి, ఆశావర్కర్లు జె.మాధవి, మరియమ్మ, సుకన్య పాల్గొన్నారు

రుణాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్


బుచ్చెంపేటలో రికవరీ డ్రైవ్ నిర్వహిస్తున్న ఉద్యోగులు

కోరుకొండ: బూరుగుపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని వాయిదా మీరిన అప్పుల వసూలు కోసం రికవరీ డ్రైవ్ చేపట్టారు. దానిలో భాగంగా సోమవారం పలువరికి నోటీసులు అందజేశారు. ఈ మేరకు బూరుగుపూడి, గుమ్ములూరు, బుచ్చెంపేట గ్రామాల్లోని 15 మంది బకాయిదారులకు నోటీసులిచ్చారు. ఆప్కాబ్ డీజీఎం సురేంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయరంగం అభివృద్ధికి సంఘాలు ఎంతో సహకారం అందిస్తున్నాయన్నారు. బకాయిలను తిరిగి చెల్లించడం ద్వారా సంఘాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి, సహకార రంగాన్ని పటిష్ట పర్చాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు రాజీవ్, ఏసుబాబు, కోరుకొండ మేనేజర్ గాజింగం అప్పారావు, సూపర్ వైజర్ విష్ణు, బూరుగుపూడి పీఏసీఎస్ సీఈఓ ఈదల సుదర్శనరావు పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడి

అనపర్తి: పొలమూరులో బెల్టు షాపుపై దాడి చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్టు రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధ సోమవారం తెలిపారు. ఈ దాడిలో నిర్వాహకుడు చంద్రమళ్ల మల్లేశ్వరరావు నుంచి 22 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.